# కుక్కబుద్ధి

**లా**యరు వినాయకరావు భోజనం పూర్తి చేసి, వాకింగ్ నెపం పై వీధిలో కొచ్చారు.

ఆయనకి లాయరుగా మంచి ప్రాక్టీసుంది. అందుచేత రెండు చేతులా సంపాదన వుంది. సిటికి నడిబొడ్డున రెండు అంతస్థుల భవనం వుంది" ఇవికాక, ఒకకారు, ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు (రెండో భార్య కింకా భాగ్యం కల్గలేదు) కూడా వున్నారు.

ఆయన ప్రతిరోజు రాత్రి ఎనిమిదింటి కల్లా మరుసటి రోజు కేసుల వివరాలన్నీ ఒక్కసారి చూసుకుని, భోజనం పూర్తి చేసి, అనింద్యుడి లాంటి ఆల్సేషన్ కుక్కని చేత్తో పుచ్చుకుని, వాకింగుకని ఇంట్లో చెప్పి, చిన్నింటికి బయలుదేరుతాడు.

అసలు చిన్నిల్లంటూ స్థాపించుకున్నది గూడ ఇటీవలనే. తన వద్దకొచ్చిన ఆస్థి తగాదా కేసుని చాకచక్కంగా నిర్వహించి భర్త లేని భానుమతికి ఆస్థి సక్రమించేలా జేసేరు. అక్కడితో లాయరుగా తనపని పూర్తయినా, వినాయకరావుగా ఇంకా పని మిగిలున్నట్లు, సలహాలు సంప్రదింపుల నెపంతో చేరువయ్యి. ఆమెని దారిలోకి మళ్ళించుకున్నారు. ఆమెకి ఒక ఫ్లాటు కొనిచ్చి అప్పటినుంచి మంచి చెడ్డా చూడసాగేరు.

ఆయనకి తన ఇంటి నించి భానుమతి ఫ్లాటుకి ఇరవై నిముషాల నడక. దారి పొడుగునా అనేక మంది ఆయనేకి విష్ చేస్తుంటారు.వాటినన్నిటిని చిరునవ్వుతో స్వీకరిస్తు, ఆల్సేషన్‌తో అలా ముందుకు సాగిపోతుంటే ఎంతో గర్వంగా, హుందాగా వుంటుందాయనకి.

ఆ రోజు ఇస్త్రీలుంగీ, తెల్లటి లాల్చి ధరించారు. నోటినిండా కిళ్ళి, ఒక చేతిలో కుక్కని బంధించిన గొలుసు, రెండో చేతిలో రాజు ప్రమాణపు (కింగ్ సైజు) సిగిరెట్టులతో మహరాజులా సాగిపోతున్నారు. భానుమతి ఫ్లాటు ఇంకా పది గజాలుంది.

అంతలో...

ఆయన చేతిలో వున్న ఆల్సేషన్ దృష్టి, ఆ ప్రక్కగా చెత్త కుండీ ప్రక్కన కడుపు నింపుకుంటున్న ఆ వీధి కుక్క పై పడింది. వెంటనే బలంగా గుంజుకుని, మొరుగుతూ దానివైపుగా పరిగెత్తింది. పరాకు చిత్తగిస్తున్న వినాయకరావు తేరుకనే సరికి గొలుసుతో సహా ఆల్సేషన్ ఆ వీధి కుక్క పైబడి కుమ్మేస్తోంది.

ఆయన తెల్లమొహం పెట్టి వెర్రిగా చూస్తున్నాడు.

వీధి కుక్క భయంతో పరిగెత్తింది. దాన్ని వెంటాడుతూ ఆల్సేషన్ ఒక క్షణంలో రెండూ కనుచూపు కందకుండామాయమైనాయ్.

అప్పటికే మిగతా ఫ్లాట్సులోని పాత్రికేయులు జరుగుతున్న పార్సుని పరమానంద భరితంగా చూస్తు ఇటీవలి టీ.వి. ప్రోగ్రాముల కన్నా ఇదే బావుందన్న నిర్ణయాని కొచ్చేస్తున్నారు.

వినాయకరావు చాలా ఇబ్బందిగా ఫీలయ్యి ఏం చెయ్యాలో తెలీక, మెల్లిగా భానుమతి ఫ్లాటులో కెళ్ళి తలుపుమూసేరు..

ఒక గంట తర్వాత, వినాయకరావు బయటకొచ్చి గృహన్ముఖులైనారు. పదడుగులు వేసి దూరాన కన్పిస్తున్న దృశ్యాన్ని చూసి అలాగే నిల్చుండి పోయారు. గంటక్రితం ఆరుచుకుని, కొట్లాడుకుని, కుమ్ములాడుకున్న వీధికుక్క, ఆల్సేషన్లు చాలా సామరస్యంగా దూరాన్నించి వస్తున్నాయ్. ఇంతకు మునుపటి ద్వేషం, వైరం, కన్పించకపోగా స్నేహం, ఆప్యాయతతృప్తి గమనించి, ఆయన విసుగ్గా మొహం చిట్లించారు.

వీధి కుక్క కుండీ చాటుకి తప్పుకుంది. ఆల్సేషన్ యజమాని దగ్గర కొచ్చి, ఆయన పాదాలు నాకుతూ నిల్చుంది.

వినాయకరావుకి ఆది చేసిన గూండాపని అర్థమైంది. దాని మెడకున్న ఇనుప గొలుసుని తిరిగి చేతిలోకి తీసుకుంటూ, "వెధవ కుక్క బుద్ధి పోనిచ్చుకున్నావు గాదు" అంటూ దాన్ని బలంగా డొక్కలో ఒక తాపు తన్నేరు ఆది బాధవల్ల 'కుయ్యో కుయ్యో" మంది.

దాని కుయ్యో మొఱ్రోలకికవీశ్వరులెవరైనా భాష్యం చెప్పగల్గితే ఆయన పరిస్థితి ఏమయ్యేదో ఏమోమరి!

కాని అటువంటి ప్రమాదం సంభవించనందున ఆయన తిరిగి బింకంగా, హుందాగా, గౌరవంగా, ఆలేషన్ సమీతుడై ఇంటిదారి పట్టేరు.